నమస్తే తెలంగాణ

# నల్లగొండ

5 | నల్లగొండ, గురువారం 23 మే 2024 | NALGONDA



సూర్యాపేట గ్రంథాలయంలో పట్టభద్రులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, చిత్రంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ తదితరులు

## మోసం చేసేది కాంగ్రెస్.. మాయ చేసేది బీజేపీ

- ప్రజల తరపున కొట్లాడేందుకు ఉన్నది బీఆర్ఎస్ ఒక్కటే
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

సూర్యాపేట, మే 22 (నమస్తే తెలంగాణ) : వంచించి మోసం చేయడం కాంగ్రెస్ నైజం అయితే సెంటిమెంట్‌తో మాయ చేసి మభ్యపెట్టేది బీజేపీ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కేవలం పదేండ్ల కాలంలో తెలంగాణను దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్‌ది అని తెలిపారు. ప్రతి పక్షంలో ఉన్నా ప్రజల పక్షాన కొట్లాడేది బీఆర్ఎస్సేనని పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించి కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పాలని నిరుద్యోగ యువతతోపాటు విద్యార్థి, ఉద్యోగులు, పింఛన్‌దారులకు పిలుపునిచ్చారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి జగదీశ్‌రెడ్డి బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో పట్టభద్రులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రచారం కోసం ఎక్కడికి వెళ్లినా నిరుద్యోగులు, పట్టభద్రులు, విద్యార్థులు, ఉద్యోగులు, పింఛన్‌దారులు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని గ్రహించి ఈసారి బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికే ఓటు వేస్తామని చెప్తున్నారన్నారు. దాంతో రాకేశ్‌రెడ్డికి భారీ మెజారిటీ ఖాయమైందన్నారు. ఇక బీజేపీ అభ్యర్థి సీజనల్‌గా ఎన్నికల సమయంలో పోటీ చేయడం తప్ప ప్రజలకు ఉపయోగపడే వ్యక్తి కాదని, అసలు బరిలో కూడా ఉండలేడని అన్నారు. మరో పక్కన కాంగ్రెస్ అభ్యర్థి జర్నలిస్ట్‌గా వచ్చిన అవకాశాలను సక్రమంగా వినియోగించి సమాజానికి ఉపయోగపడకుండా చీకటి సంపాదనకు అలవాటు పడ్డాడన్న విషయాన్ని యువత అర్థం చేసుకుందన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగబోయే పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరపున బరిలో ఉన్న ఏనుగుల రాకేశ్‌రెడ్డి బిట్స్‌పిలానీలో చదివి, అమెరికాలోని టాప్ కంపెనీల్లో ఉద్యోగం చేస్తూ తెలంగాణ కోసం అన్నీ వదులు కొని రాజకీయాల్లోకి వచ్చాడని తెలిపారు. ఆయనను గెలిపిస్తే శాసన మండలిలో తన గొంతుక వినిపిస్తారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలల్లో ఏం చేసిందో రాష్ట్ర ప్రజలు గుర్తించారని, కాంగ్రెస్ అభ్యర్థి గెలిస్తే మండలిలో అధికార పార్టీకి తొత్తుగానే ఉంటాడు తప్ప ప్రజల తరపున మాట్లాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గండూరి ప్రకాశ్, మర్ల చంద్రారెడ్డి, మొరిశెట్టి శ్రీనివాస్, ఎంపీపీలు రవీందర్‌రెడ్డి, నెమ్మాది భిక్షం జడ్పీటీసీలు జీడి భిక్షం, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



పీఓలు, ఏపీఓల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

## పీఓలు, ఏపీఓలు సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, మే 22 : ఈ నెల 27న జరిగే నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పీఓలు, ఏపీఓలు బాధ్యతాయుతంగా, సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పీఓలు, ఏపీఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. జిల్లాలో 51,497 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 71 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిల్లో విధులు నిర్వహించేందుకు రిజర్వ్ ఉద్యోగులతో కలిపి పీఓలు 85, ఏపీఓలు 85, 170 మంది ఓపీఓలను నియమించినట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రం లో వెబ్‌కాస్టింగ్ ఉంటుందని వెల్లడించారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించనున్న ట్లు తెలిపారు. 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు చెప్పారు. బ్యాలెట్ పేపర్ల కోసం జంబో బ్యాలెట్ బాక్స్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ప్రతి ఓటరు పోలింగ్ స్లిప్‌తోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన గుర్తింపు కార్డును తప్పనిసరి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంసీసీ నోడల్ అధికారి, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, జిల్లా రవాణా శాఖ అధికారి సురేశ్, ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

## 13మంది ఓపీఓల సస్పెన్షన్

### శిక్షణకు హాజరుకాక పోవడంతో చర్యలు

సూర్యాపేట, మే 22 : నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల శాసనమండల ఉప ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులకు హాజరుకాని 13 మంది ఓపీఓలను సస్పెండ్ చేస్తున్నట్లు సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. వెంకట్రావ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సూర్యాపేటలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి వారు హాజరుకాలేదని, ప్రజాప్రాతినిధ్యం 1951 ప్రకారం వారిని తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు వారి వివరాలను సమర్పించాలని ఆదేశించారు.

## 26న జేఈఈ అడ్వాన్స్ పరీక్ష

రామగిరి, మే 22 : జేఈఈ అడ్వాన్స్-2024 ఆన్‌లైన్ పరీక్ష ఈ నెల 26న నిర్వహించనున్నారు. నల్లగొండలోని ఎస్పీఆర్ స్కూల్ ప్రాంగణంలోని డీపీఎంఎస్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో సెంటర్ ఏర్పాటు చేశారు. 360మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పేపర్ -1 ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. పేపర్-2 మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు జరుగనుంది.

## వానకాలం నుంచి పంట బీమా పథకం అమలు

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రావణ్‌కుమార్



ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ శ్రావణ్‌కుమార్

నీలగిరి, మే 22 : వానకాలం నుంచి రైతులకు ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నట్లు నల్లగొండ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పాల్వాయి శ్రావణ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉచిత పంటల బీమా పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి పసల్ బీమా యోజన పథకంలో భాగంగా ఈ బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వానకాలంలో పత్తి, వరి, టమాట, కంది పంటలకు, యాసంగిలో వేరుశనగ పంటలకు ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీమా పథకం వర్తిస్తుందని తెలిపారు. రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద తాము వేసిన పంటల వివరాలను నమోదు చేసుకోవాలని చెప్పారు.

రైతు ఒక పంట పండించి, మరో పంట నమోదు చేసుకుంటే ఇది వర్తించదన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినా, అడవి జంతువుల వల్ల పంట నష్టం జరిగినా ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కమిషనరేట్ హైదరాబాద్‌కి చెందిన డిప్యూటీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్ బాబు, యాదాద్రి భువనగిరి జిల్లా వ్యవసాయ అధికారి అనూరాధ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంగీతలక్ష్మి, ట్రైనర్ సుమన్, ఉమ్మడి జిల్లా వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

- ఎస్పీ చందనా దీప్తి

నీలగిరి, మే 22 : ఈ నెల 24 నుంచి జూన్ 3 వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ చందనా దీప్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు జరుగనున్నందున పరీక్ష కేంద్రాల సమీపంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దని, ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించకూడదని సూచించారు.

## ఆటోవాలా..

రోజురోజుకు పడిపోతున్న ఆటో గిరాకీ

పల్లెలు, పట్టణాల్లో ఉపాధికి గట్టి దెబ్బ

# బతుకు బండి నడిచేదెలా?

- ఇంటి అద్దెలు, బండి కిస్తీలు కట్టడానికి అవస్థలు
- ఇప్పుడు పిల్లల స్కూల్ డబ్బులకి కష్టాలు
- అప్పులు తెచ్చి చెల్లించాల్సిన పరిస్థితులు
- కనీసం పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- జీవనభృతి కల్పించాలని ఆటోడ్రైవర్ల వేడుకోలు



తిరుమలగిరి ఆటో స్టాండ్‌లో గిరాకీ లేక నిలిచిన ఆటోలు

**ఆటో డ్రైవర్లు స్టీరింగ్ పడితేనే కుటుంబ కదులుతుంది. నిరంతరం రోడ్డుపై తిరిగితేనే పూట గడుస్తుంది. పిల్లల చదువులు, తల్లిదండ్రుల వైద్యం, నిత్యావసరాలు వంటివెన్నో ఆటోపైనే ఆధారపడి ఉన్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని ఆటో డ్రైవర్లకు బతుకులు కాంగ్రెస్ పాలనలో భారమయ్యాయి. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఫ్రీ బస్సులను నడుపుతున్న ప్రభుత్వం ఆటో డ్రైవర్ల జీవనభృతిని పట్టించుకోకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి దాపురించింది. రోజురోజుకు ఆటోల గిరాకీ మరింత పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే చాలీచాలని డబ్బులతో బండి కిస్తీలు కట్టడానికే అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు పిల్లల స్కూల్ సీజన్ రావడంతో మరిన్ని కష్టాలు షురూ అయ్యాయి. ఫీజులు, పుస్తకాలు, డొనేషన్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.**

– యాదాద్రి భువనగిరి, మే 22 (నమస్తే తెలంగాణ)/తిరుమలగిరి

యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 5వేల ఆటోలు నడుస్తున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు నిత్యం వందలాది ఆటోలు వస్తూ పోతుంటాయి. దీని ద్వారా ఆటో కార్మికులకు ఉపాధి లభిస్తుంది. గతంలో నిత్యం ఖర్చులన్నీ పోగా నాలుగైదు వందల వరకు చేతికి వచ్చేవి. దాంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు ఉండేవి కాదు. ఫ్రీ బస్సు వచ్చాక పరిస్థితి తారుమారైంది. ఆటోల్లో వెళ్లితే డబ్బులు చెల్లించాల్సి ఉండటంతో మహిళలంతా ఆర్టీసీ ఫ్రీ బస్సులకే మొగ్గు చూపుతూ ఉచితంగా వెళ్లిపోతున్నాయి. దీంతో రోజురోజుకు ఆటోలకు ఆదరణ తగ్గుతూ వస్తున్నది. గతంలో వచ్చిన డబ్బుల్లో సగం కూడా రావడం లేదు. రోజుకు రూ. 200 కూడా మిగలడం లేదు. ఫలితంగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### బండి కిస్తీలకు ఆపసోపాలు..

ఆటో డ్రైవర్లంతా బడుగు బలహీన వర్గాలకు చెందిన పేదలే. ఆటోలు మొత్తం డబ్బులు ఒక్కసారే చెల్లించే స్తోమత ఉండదు. షోరూమ్‌లలో మొదట కొంత డబ్బులు కట్టి, ఈఎంఐ ప్లాన్ చేసుకుంటారు. ఆటో నడుపడంతో మిగిలిదాంట్లో నుంచి నెలకు కొంత మేరకు ఈఎంఐలు చెల్లిస్తారు. కానీ కొంత కాలంగా గిరాకీలు లేపోవడంతో ఈఎంఐలు చెల్లించలేని పరిస్థితి వచ్చింది. కొందరు అప్పులు తెచ్చి చెల్లిస్తుండగా, మరికొందరు కట్టలేక చేతులెత్తేస్తున్నారు. దాంతో ఫైనాన్స్ వాళ్లు బండ్లను గుంజుకుపోతున్న ఘటనలు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. అదే విధంగా ఇంటి అద్దెలు చెల్లించడానికి కూడా ఇబ్బందులు తప్పడం లేదు.

### పిల్లల స్కూల్ డబ్బులకు కష్టాలు..

ఆటో కార్మికుల కుటుంబాలు గడవడమే కష్టంగా మారింది. ఇప్పుడు కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. పిల్లలకు స్కూల్ ఫీజులు, పుస్తకాలు, డ్రెస్‌లు, డొనేషన్లు తదితర ఖర్చుల భారం ఉంది. అడ్మిషన్లు, డొనేషన్లు, ఫీజులు అంటూ రూ. వేలకు వేలు స్కూళ్లకు కట్టాలి. ఇవి కాకుండా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలకు అదనం. ఇక రెసిడెన్షియల్ పిల్లలకు అదనపు ఖర్చులు. స్కూల్ బస్సుల చార్జీలు సైతం చెల్లించాల్సిందే. దీంతో కొందరు బంగారం, ఇతర సొమ్ములను కుదవ పెట్టి వడ్డీలకు అప్పులు తెస్తున్నారు. ఇక కొంత మంది చేతిలో డబ్బులు లేకపోవడంతో చేసేదేంలేక ప్రభుత్వ బడులకు పంపించేందుకు సిద్ధమవుతున్నారు. ఆటో నడవకపోవడంతో పూట గడవడమే కష్టంగా ఉందని, పిల్లల ఖర్చుల ఎలా భరించాలని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కనీసం పట్టించుకోవడంలేదని, పక్క రాష్ట్రాల్లో ఆటో కార్మికులను ఆదుకుంటున్నారని గుర్తు చేస్తున్నారు. ఏటా ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

### తుంగతుర్తి నియోజకవర్గంలో..

తుంగతుర్తి నియోజకవర్గంలో 600 ఆటో కుటుంబాలు ఉన్నాయి. వీరంతా ఆటో వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మహిళలకు ఆర్టీసీలో ఫ్రీగా ప్రయాణం కల్పించక ముందు రోజుకు రూ.800 నుంచి రూ.1000 వరకు సంపాదించేవారు. ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చిన తర్వాత ఆటో ఎక్కేవారే కరువయ్యారు.

### పిల్లల స్కూల్ ఫీజులు కట్టడం కష్టమే..



మహిళలకు ఫ్రీ బస్సు పథకం వల్ల మా బతుకులు ఆగమైనయి. రోజుకు ఆటో నడిపితే 200 రూపాయలు కూడా రావడం లేదు. గిరాకీ లేక ఆటో డ్రైవర్లు పస్తులుంటున్నారు. జూన్ నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్నాయి. పిల్లలకు పుస్తకాలు, యూనిఫామ్, ఫీజులు భరించడం ఇక కష్టమే. ఇటు ఆటోను వదులుకోక, వేరే పనులు చేయలేక ఆటో డ్రైవర్లు చస్తూ బతుకుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి.

**- బాలెబోయిన తిరపయ్య, ఆటోడ్రైవర్, చిలుకూరు**

### జనం ఆటోలు ఎక్కడం లేదు



మహిళలకు ఫ్రీ బస్సు ఉండడంతో ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోయారు. ప్యాసెంజర్లు లేక ఆటోస్టాండ్ల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తున్నది. కుటుంబ పోషణ భారంగా మారింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆటో డ్రైవర్ల బతుకులు రోడ్డున పడుతాయి. ప్రభుత్వం ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ మార్గం చూపించి ఆదుకోవాలి.

**-పులుసు రవి, ఆటో యూనియన్ ఉపాధ్యక్షుడు, నూతనకల్**

### ప్రభుత్వం జీవన భృతి కల్పించాలి



కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీ బస్సు పథకం తెచ్చి ఆటో కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నది. గిరాకీ లేక నానా అవస్థలు పడుతున్నాం ప్రభుత్వం తక్షణమే ఆటో కార్మికులకు జీవన భృతి కల్పించి ఆదుకోవాలి. గతంలో ఏదైనా కార్యక్రమాలు ఉంటే, ఎటైనా వెళ్లాలంటే మహిళలు ఆటోలను సంప్రదించేవారు. ప్రస్తుతం ఫ్రీ బస్సులు రావడంతో ఆటోలో వెళ్లడం మానేశారు.

**- అండం మహేశ్, ఆటో యజమాని, తుంగతుర్తి**

### రోజుకు వంద రూపాయలు కూడా రావడం లేదు



ఉదయం 7 గంటలకు ఆటో స్టాండ్ దగ్గరికి వస్తే ఉదయం 10 గంటలైనా ఒక్క ప్యాసెంజర్ కూడా ఆటో ఎక్కలేదు. మహిళలకు బస్సులో ఫ్రీ ఉండడంతో ఆటోలకు పూర్తిగా గిరాకీ తగ్గి పోయింది. రోజు మొత్తం కష్టపడ్డా వంద రూపాయలు కూడా రావడం లేదు. కుటుంబ పోషణ భారంగా మారింది. గతంలో తిరుమలగిరి పాత గ్రామం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు లోకల్ ప్యాసెంజర్స్ ఆటోలో ప్రయాణించేవారు. వాతాంతపు సంత ప్రతి బుధవారం గిరాకీ బాగానే ఉండేది. ఫ్రీ బస్ రావడంతో మా ఉపాధిని దెబ్బకొట్టింది. కూరగాయల సంతకు కూడా జనం బస్సులోనే వచ్చి పోతున్నారు. ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలి.

**-గంటా సుధాకర్, ఆటో డ్రైవర్ తిరుమలగిరి**

### ఫైనాన్స్ కట్టలేక పోతున్నాం..

ఫ్రీ బస్ పథకంతో మా బతుకులు భారంగా మారా యి. ఆటోలు నడువక అవస్థలు పడుతున్నాం. కూలీలకంటే అధ్వానంగా మారింది. ఆదా యం లేక ఆటో ఫైనాన్స్ కట్టలేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలి. లేకుంటే మా కుటుంబాలు వీధిన పడుతాయి.

**-చిప్పలపల్లి లక్ష్మయ్య, ఆటో డ్రైవర్, నాగారం**



## నేడు ఎడ్‌సెట్

- నల్లగొండ, సూర్యాపేటలో 4 ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 1,100 మంది విద్యార్థులు

రామగిరి, మే 22 : రాష్ట్రంలో రెండేండ్ల బీఈడీ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే ఎడ్‌సెట్-2024 ప్రవేశ పరీక్ష గురువారం జరుగనున్నది. మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించే పరీక్ష కోసం 79 ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎడ్‌సెట్ చైర్మన్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, కన్వీనర్ ప్రొఫెసర్ మృణాళిని వెల్లడించారు. పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 33,879 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, వీరిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సెషన్-1లో 16,929, మధ్యాహ్నం 2నుంచి 4 గంట ల వరకు జరిగే రెండో సెషన్‌లో 16,950 మందిని కేటాయించారు. నిర్ణీత సమయం తర్వాత ఎట్టి పరిస్థితిలో పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులకు అనుమతి ఉండదన్నారు. హాల్‌టికెట్స్ రాని విద్యార్థులు https://edcet.tsche.ac.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఉదయం 8:30, మధ్యాహ్నం 12:30లోగా అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

### ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలు..

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నాలుగు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో 1,100 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. నల్లగొండలోని ఎస్పీఆర్ స్కూల్ ప్రాంగణంలోని డీపీఎంఎస్ ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో రెండు సెషన్లలో 360 మంది, సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో రెండు సెషన్లలో 400 మంది, కోదాడలోని సనా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు సెషన్లలో 160 మంది, కోదాడలోని మదిర ఇంజినీరింగ్ కళాశాలలో 180 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి భారీ మెజార్టీ అందించాలి



నల్లగొండలో బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పక్కన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

- బీఆర్ఎస్ ఏం చేసిందో.. కాంగ్రెస్ ఏం చేస్తున్నదో పట్టభద్రులు ఆలోచించాలి
- బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నీలగిరి, మే 22 : ఈ నెల 27న జరుగనున్న నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల శాసన మండలి ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటుతోనే భారీ మెజార్టీ వచ్చేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. నల్లగొండలో కంచర్ల భూపాల్‌రెడ్డి నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన బూత్‌స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీఆర్ఎస్ పాత్ర చాలా ఉందని, మాజీ సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ప్రతి ఓటరుకు తెలంగాణపై, బీఆర్ఎస్‌పై అమితమైన ప్రేమ ఉందని వారందరినీ కదిలించి మొదటి ప్రాధాన్యత ఓటు వేయించేలా పనిచేయాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నేచర్ బ్లాక్ మెయిల్ తత్వమని, అలాంటి వారికి ఓటేస్తే మండలిలో బ్లాక్ మెయిలర్స్‌కు అవకాశం ఇచ్చినట్లు అవుతుందని చెప్పారు. రోజుకో పార్టీ మారి ఆ పార్టీలోని వ్యక్తులనే నిత్యం తిట్టిపోసిన వ్యక్తికి కాంగ్రెస్ పార్టీ సీటు ఇవ్వటం సిగ్గుచేటన్నారు. అలాంటి వారికి బుద్ధి చెప్పాలంటే విద్యా వంతుడు, వినయుడు రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల్లో అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఈ ఐదు నెలల్లో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసినందున ఈ ఎన్నికల్లో పట్టభద్రులు విచక్షణతో ఆలోచించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసింది, ప్రస్తుత కాంగ్రెస్ ఏం చేస్తుందో పట్టభద్రులు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, మారగోని భవానీగణేశ్, ఎంపీపీ కరీంపాషా, నాయకులు వంగాల సహదేవ్‌రెడ్డి, మెరుగు గోపి, సింగం రామ్ మోహన్ పాల్గొన్నారు.

## ఇద్దరు పిల్లలను మింగిన చెరువు గుంత

- ఆడుకుంటూ వెళ్లి మృత్యువాత
- దామరచర్లలో విషాదం

దామరచర్ల, మే 22 : దామరచర్ల మండల కేంద్రంలో బుధవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. స్థానిక బైరవాన్ చెరువు గుంతలో పడి ఇద్దరు చిన్నారులు ఇండ్ల ధనుష్(11), పెద్దిశెట్టి సాత్విక్(7)మృతి చెందారు. సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు జిల్లా మాచర్ల మండలం రాయవరం గ్రామానికి చెందిన ఇండ్ల నాగరాజు, సౌజన్య దామరచర్లలో గత ఎనిమిదేండ్లుగా నివాసముంటూ నాపరాయి పాలిష్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు మగపిల్లలు. దామరచర్లలో ముత్యాలమ్మ తిరునాళ్ల సందర్భంగా గుంటూరు జిల్లా మాచవరం మండలం వేమవరం గ్రామం నుంచి తన సడ్డకుడు పెద్దిశెట్టి నరేంద్ర కుమారులు ఇద్దరు రెండ్రోజుల క్రితం నాగరాజు ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో నలుగురు పిల్లలు కలిసి దామరచర్ల పాఠశాల వద్ద ఆడుకొని అనంతరం చెరువు వద్దకు వెళ్లారు. వీరిలో నాగరాజు కుమారుడు ధనుష్, నరేంద్ర కుమారుడు సాత్విక్ ఈత కోసం చెరువులోకి దిగగా గుంతలో కూరుకుపోయారు. ఈ విషయాన్ని బయట ఉన్న ఇద్దరు పిల్లలు గ్రామంలోకి వెళ్లి ఇంట్లో చెప్పడంతో గ్రామస్తులు చెరువు గుంతలోకి దిగి సాత్విక్‌ను రక్షించారు. ధనుష్ అప్పటికే నీటిలో మునిగి చనిపోయాడు. సాత్విక్‌ను చికిత్స కోసం మిర్యాలగూడకు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ధనుష్ దామరచర్ల ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి, సాత్విక్ రాయవరంలో రెండో తరగతి చదువుతున్నాడు. వీరి మృతితో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇండ్ల నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.



చిన్నారులు చనిపోయిన గుంత ఇదే